సాక్షి
పశ్చిమగోదావరి
సోమవారం । 24 । ఫిబ్రవరి । 2025



క్షీరారామంలో శివరాత్రి శోభ
పంచారామక్షేత్రం పాలకొల్లులోని క్షీరారామ లింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. 8లో



పట్టిసంలో సర్వం సిద్ధం
మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిసం క్షేత్రం ముస్తాబవుతోంది. మూడు రోజులపాటు వేడుకలకు భారీగా భక్తులు రానున్నారు. 8లో



అంతర్ జిల్లా దొంగల అరెస్టు
బైక్‌లు, బంగారం చోరీలకు పాల్పడుతున్న ఆరుగురు అంతర్ జిల్లా దొంగలను భీమవరం పోలీసులు అరెస్ట్ చేశారు. 8లో

న్యూస్‌రీల్

చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలి




కవురు శ్రీనివాస్, ఎమ్మెల్సీ

వీరవాసరం: ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను కూటమి ప్రభుత్వం నెరవేర్చకుండా ప్రజలందరినీ మోసం చేస్తోందని, సీఎం చంద్రబాబు బహిరంగ క్షమాపణ చెప్పాలని ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఆదివారం నవుడూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో బడుగు, బలహీనవర్గాల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేసిన పార్టీ ఒక్క వైఎస్సార్‌సీపీ మాత్రమే అన్నారు. అభివృద్ధి, సంక్షేమం బండికి రెండు చక్రాల మాదిరిగా సుపరిపాలన అందించిన ఘనత జగన్‌కే దక్కుతుందన్నారు. నాడు–నేడు పేరుతో పాఠశాలలు, ప్రభుత్వాస్పత్రులను అభివృద్ధి చేశారని గుర్తు చేశారు. సెకితో విద్యుత్ ఒప్పందాల వల్ల రాష్ట్రానికి భారీగా మిగులు నిధులు ఏర్పడటానికి మాజీ సీఎం జగన్ కారణమని స్పెషల్ కమిటీ పేర్కొనడం గమనార్హం అన్నారు. ఎన్నికల ముందు అసత్య ఆరోపణలతో చంద్రబాబు గద్దెనెక్కారని, అధికారం కోల్పోయినా ప్రజల గుండెల్లో జగన్ నిలిచిపోయారని అన్నారు. జగన్ ఏ కార్యక్రమానికి వెళ్లినా తండోపతండాలుగా వస్తున్న ప్రజాభిమానమే ఇందుకు నిదర్శనమని ఎమ్మెల్సీ శ్రీనివాస్ అన్నారు.

వైఎస్సార్‌సీపీ కార్యకర్త అక్రమ అరెస్ట్

ఉండి: మండలంలోని కలిగొట్ల గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త దాసరి కిశోర్‌బాబును పోలీసులు ఆదివారం రాత్రి అక్రమంగా అరెస్టు చేశారు. కిశోర్‌బాబు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 10 నెలల క్రితం కలిగొట్లలో గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు యశోద కృష్ణపై గుర్తుతెలియని వ్యక్తి దాడి చేయగా అప్పట్లో కేసు నమోదైంది. ఇదిలా ఉండగా ఆదివారం తాను యశోద కృష్ణను చంపుతానని, గతంలో కూడా చంపేందుకు ప్రయత్నించింది తానేనని అన్నట్టు ఓ నంబర్ నుంచి యశోదకృష్ణకు ఎవరో వాట్సాప్ మెసేజ్ పెట్టారని కిశోర్‌బాబు అన్నారు. అసలు ఆ ఫోన్ నంబర్ తనది కాదని, ట్రూకాలర్‌లో తన పేరు, తన ఫొటో వచ్చేలా చేసి కేసులో తనను, తన బంధువులను ఇరికించేందుకు ప్రయత్నిస్తున్నారని కిశోర్‌బాబు వాపోయారు. తాను జగన్ అభిమానినని కుట్రలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాను యశోద కృష్ణను బెదిరించలేదని కిశోర్‌బాబు తెలిపారు.

భళా.. చికెన్ మేళా



ఏలూరు ఏఎస్‌ఆర్ స్టేడియంలో చికెన్ వంటకాలను వడ్డిస్తున్న దృశ్యం

ఏలూరు (టూటౌన్): బర్డ్‌ఫ్లూ నేపథ్యంలో చికెన్, గుడ్లు తినడంపై ప్రజల్లో నెలకొన్న అపోహలను తొలగించేందుకు పౌల్ట్రీ యాజమాన్యం, చికెన్ వ్యాపారులు సంయుక్తంగా స్థానిక ఏఎస్‌ఆర్ స్టేడియంలో ఆదివారం చికెన్ మేళా నిర్వహించారు. పలురకాల చికెన్ వంటకాలను వండి వడ్డించారు. మేళాకు స్పందన బాగుండటంపై నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేశారు. జిల్లాలో బర్డ్‌ఫ్లూ వచ్చిన ప్రాంతంలో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక నివారణా చర్యలు తీసుకున్నారని, ఆయా ప్రాంతాల్లో కోళ్లను ఖననం చేసి గుడ్లను పూడ్చిపెట్టినట్టు నిర్వాహకులు తెలిపారు. ఉడికించిన చికెన్, గుడ్లలో బర్డ్‌ఫ్లూ అవశేషాలు ఉండవని, నిర్భయంగా చికెన్, గుడ్లను తినవచ్చని అవగాహన కల్పించారు. పశుసంవర్ధకశాఖ ఇన్‌చార్జి జేడీ టి.గోవిందరాజు, జీబీఆర్ హేచరీస్ ఎండీ జి.సుబ్బారావు, బొబ్బా సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

మిర్చి ధరలపై ప్రభుత్వ వైఖరితో నష్టం

ఏలూరు (టూటౌన్): మిర్చి ధరలు తగ్గి రైతులు తీవ్ర ఆందోళన చెందుతుంటే క్వింటాల్‌కు రూ.11,600 ధరను రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్రానికి ప్రతిపాదన చేయడం, కేంద్రం కేవలం రూ.11,781 ధర నిర్ణయించడం రైతులకు ఏమాత్రం ప్రయోజనకరం కాదని ఏపీ రైతు సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి కె.శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఏలూరు అన్నే భవనంలో ఆయన మాట్లాడుతూ మిర్చి క్వింటాల్‌కు రూ.20 వేల నుంచి రూ.25 వేలకు తక్కువ కాకుండా ధరలు లభించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి చేసి మిర్చి విదేశాలకు ఎగుమతి చేసేందుకు అనుమతులు పొందాలన్నారు. మార్కెట్ ఇంటర్వెన్షన్ పథకం కింద ధరల వ్యత్యాసం నుంచి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. మిర్చితో పాటు పత్తి, కోకో, అపరాలు ధరలు తగ్గడంతో రైతులు భారీగా నష్టపోతున్నారన్నారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలను తక్షణమే రైతులకు అందించాలని కోరారు.

రైతన్నకు మిర్చి గొట్టు

పతనమైన ధర
- రైతులు బెంబేలు.. నిల్వ చేసిన వ్యాపారులు గగ్గోలు
- రెండేళ్ల క్రితం ఆశలు నింపిన సాగు
- ప్రస్తుతం సగానికి పైగా తగ్గిన ధరలు
- పడాల మార్కెట్‌కు మిర్చి నిల్వలు
- కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో కుదేలు



పొలంలోని కల్లాల్లో మిర్చి పంటను ఆరబెట్టిన దృశ్యం

తాడేపల్లిగూడెం : ఎండు మిరపకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అల్లాడుతున్నారు. ధర పెరుగుతుందనే ఆశతో ఇప్పటికే నిల్వలు చేసిన వ్యాపారులు గగ్గోలు పెడుతున్నారు. చీడపీడల నివారణకు అధిక వ్యయం కావడంతో రైతులకు పెట్టుబడులు పెరిగినా గిట్టుబాటు ధర మాత్రం లేదు. రెండేళ్ల క్రితం ఇదే సీజన్‌లో ఎండు మిర్చి పండించిన రైతుల పంట పండింది. అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలతో రైతుల లోగిళ్లు సంతోషాలతో నిండాయి. అదే ఉత్సాహంతో ఈ ఏడాది ఎండు మిర్చి పంట వేసిన రైతులు కూటమి ప్రభుత్వ నిర్ణయాలతో కుదేలయ్యారు. ఈ సీజన్‌లో ఇటు జిల్లాలో దేశవాళీ రకాలు, అటు తెలంగాణ ప్రాంతంలో మిగిలిన రకాల దిగుబడులు బాగున్నాయి. అయితే ధరలు భారీగా పతనం కావడంతో రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ఇటీవల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపట్టిన ఆందోళనతో అయినా ప్రభుత్వంలో కదలిక వచ్చి గిట్టుబాటు, మద్దతు ధరలు లభిస్తాయనే ఆశతో రైతులు ఉన్నారు.

అధికంగా లావు రకం సాగు

ఉమ్మడి పశ్చిమలో లావులు రకంగా (దేశవాళీ) పేరున్న మిర్చిని రైతులు ఎక్కువగా పండిస్తున్నారు. ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెం, దేవులపల్లి, పేరంపేట, ఏలేరుపాడు, కుక్కునూరు ప్రాంతాల్లో సాగు చేస్తున్నారు. దిగుబడి సన్నరకాలతో పోలిస్తే లావు రకానికి తక్కువ ఉన్నా ధరలు మాత్రం బాగుంటాయి. కూర కారం, పచ్చళ్ల కారం కోసం ఈ రకాన్ని వినియోగదారులు, వ్యాపారులు కొనుగోలు చేస్తారు. ఈ రకాన్ని సేంద్రియ పద్ధతిలో దేవరపల్లి మండలంలో రైతులు పండిస్తున్నారు. మొత్తం డిమాండ్‌ను లావు రకం తీర్చలేని పరిస్థితుల్లో కర్ణాటక నుంచి వచ్చే బేడికి రకాలను వ్యాపారులు కొనుగోలు చేస్తున్నారు. వీటితో పాటు ఖమ్మం జిల్లా వీఎం బంజరు, వెంకటాపురం, చర్ల ప్రాంతాల్లో మిర్చిని పండిస్తున్నారు. ఇక్కడ కూడా లావులు రకం పండుతున్నాయి. సన్నని రకాలైన 341, నంబర్ 05, బేడికి, తేజ రకాలు గూడెం మార్కెట్‌కు వస్తున్నాయి.

గత సీజన్‌తో పోలిస్తే ధరలు ఇంకా పెరగాలి

ఎండు మిర్చి ధర గత సీజన్‌తో పోలిస్తే ఇంకా పెరగాలి. రైతులకు పెట్టుబడులు పెరిగాయి. ఈసారి దిగుబడులు బాగున్నా ఆశించిన స్థాయిలో గిట్టుబాటు ధర లేదు. దీంతో రైతులు ఇబ్బంది పడుతున్నారు.
– ఎం.ప్రసాద్, వ్యాపారి, తాడేపల్లిగూడెం

2023లో రూ.25 వేలు.. నేడు రూ.13 వేలు

సన్నరకం మిర్చి క్వింటాలు ధర 2023లో **రూ.25 వేలు పలక**గా ప్రస్తుతం రూ.13 వేలకు **పడిపోయింది.** క్వింటాల్‌కు 341 రకం **రూ.12,500 నుం**చి రూ.13,500, నంబర్–05 **రకం రూ.13 వే**ల నుంచి రూ.14,500, బేడికి **రకం రూ.15 వే**ల నుంచి రూ.16 వేలు, తేజ **రకం రూ.12,500** నుంచి రూ.13 వేలు ఉంది. **దేశవాళీ లావు** రకాలు మాత్రమే క్వింటాల్ **రూ.38 వేల నుం**చి రూ.42 వేల వరకు పలుకు**తున్నాయి. గత** సీజన్‌తో పోలిస్తే ఎండు మిర్చి పండించే విస్తీర్ణం తగ్గినా దిగుబడులు ఆశాజనకంగా ఉన్నాయి. సన్న రకాలు ఎకరాకు 20 క్వింటాళ్ల వరకు లావు రకాలు పది క్వింటాళ్ల వరకు దిగుబడి వచ్చాయి. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మాదిరిగా ఎండు మిర్చి ధరలు ఆశాజనకంగా ఉంటాయని భావించిన వ్యాపారులు పెద్ద మొత్తంలో శీతల గిడ్డంగుల్లో సరుకును నిల్వ చేశారు. కూటమి ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానం వల్ల గుంటూరు, ఖమ్మం, వరంగల్ ప్రాంతాలతో పాటు జిల్లాలో మిర్చి నిల్వలు చేసిన వ్యాపారులు సుమారు రూ.2 వేల కోట్ల వరకు నష్టపోయినట్టు మార్కెట్ వర్గాల అంచనా.

పడాల మార్కెట్‌కు 3 వేల బస్తాలు

జిల్లాలో ఎండు మిర్చి (దేశవాళీ రకం) వ్యాపారానికి కేంద్రంగా ఉన్న తాడేపల్లిగూడెంలోని పడాల వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఆదివారం 3 వేల శాల్తీల (బస్తాల) మిరప వచ్చింది. లావు రకాలతో పాటు సన్నాలైన 341, నంబర్ 05, బేడికి, తేజ రకాలు వచ్చాయి. ఉమ్మడి జిల్లాతో పాటు తూర్పుగోదావరి జిల్లా అమలాపురం తదితర ప్రాంతాల నుంచి వచ్చిన వ్యాపారులు ఎండు మిర్చిని కొనుగోలు చేసి వెళ్లారు. వ్యాపారులు సరుకు బాగానే కొనుగోలు చేసినా సరైన ధరలు లేక రైతులకు నిరాశే ఎదురైంది.

పిల్లల ఆధార్‌కు ప్రత్యేక క్యాంపులు

భీమవరం (ప్రకాశంచౌక్): జిల్లాలో అంగన్‌వాడీ కేంద్రాల్లో పిల్లల ఆధార్ నమోదుకు సోమవారం నుంచి 28 వరకు ప్రత్యేక మొబైల్ ఆధార్ క్యాంపులను నిర్వహించనున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. జిల్లా ఆరేళ్లలోపు పిల్లల ఆధార్ నమోదుకు 88 క్యాంపులు నిర్వహించనున్నామన్నారు. అంగన్‌వాడీ వర్కర్లు ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, సీడీపీఓలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుని తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు ఆధార్ కార్డులు లేని పిల్లలందరికీ నూరు శాతం కొత్త ఆధార్ కార్డుల నమోదుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలాల వారీగా ఆచంటలో 2, ఆకివీడులో 4, అత్తిలిలో 3, భీమవరంలో 6, యలమంచిలిలో 5, గణపవరంలో 5, పెంటపాడులో 3, ఇరగవరంలో 2, కాళ్లలో 4, మొగల్తూరులో 4, నరసాపురంలో 4, పాలకొల్లులో 4, పాలకోడేరులో 3, పెనుగొండలో 3, పెనుమంట్రలో 3, పోడూరులో 4, తాడేపల్లిగూడెంలో 6, తణుకులో 2, ఉండిలో 4, వీరవాసరంలో 4 క్యాంపులు ఏర్పాటుచేశామన్నారు. అలాగే పట్టణాల వారీగా భీమవరంలో 5, నరసాపురంలో 4, పాలకొల్లులో 4, తాడేపల్లిగూడెంలో 5, తణుకులో 6 కేంద్రాలను ఏర్పాటుచేశామని కలెక్టర్ నాగరాణి వివరించారు.

నేడు పీజీఆర్ఎస్ రద్దు

భీమవరం (ప్రకాశంచౌక్): తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో సోమవారం జిల్లా, డివిజన్, మండల కార్యాలయాల్లో నిర్వహించే ప్రజాసమస్యల పరిష్కార వేదికను (పీజీఆర్ఎస్) రద్దు చేస్తున్నట్టు కలెక్టర్ చదలవాడ నాగరాణి తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు.

ఇచ్చిన మాటకు కట్టుబడే నేత జగన్



తేతలిలో వైఎస్సార్‌సీపీ నాయకులతో మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

మాజీ మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

తణుకు అర్బన్: వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిబద్ధతతో కూడిన వ్యక్తి అని, ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే నాయకుడని మాజీ మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. అబద్ధపు హామీలు ఇవ్వకపోవడమో, ఈవీఎంల మహిమతోనో ప్రతిపక్షంలో ఉండాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. ఆదివారం తేతలిలో పార్టీ నాయకులు భూపతిరాజు రామకృష్ణరాజు నివాసంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అబద్ధపు హామీలతో ప్రజలను వంచించి కూటమి ప్రభుత్వం ఏర్పడిందని, జగన్ అంటే ఏంటో, చంద్రబాబు ఏంటో అనే విషయం ప్రజలకు కూడా అర్థమైందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి 9 నెలలు గడిచినా ఇంతవరకు సూపర్ సిక్స్ పథకాలు అమలుచేయకపోవడాన్ని ప్రజలు ఛీకొడుతున్నారని, అందుకే ఎమ్మెల్యేలు ప్రజల్లోకి వెళ్లలేక దాక్కుని తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. రాబోయే రోజుల్లో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పూర్తి స్థాయిలో ప్రజల్లో ఉంటారని, ప్రజాసమస్యలపై పోరాటంతోపాటు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటారని అన్నారు. అనంతరం తేతలిలో నిర్వహిస్తున్న పూజాదికాల్లో కారుమూరి పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. మాజీ సర్పంచ్ కోట నాగేశ్వరరావు, నాయకులు కోట స్వామీజీ, సరెళ్ల వీరతాత, నడింపల్లి రాజ్యంరాజు, భూపతిరాజు బాలకృష్ణంరాజు, భూపతిరాజు నేతాజీ, తేతలి సీతారాం సుబ్రహ్మణ్యం, దారం శ్రీను, మానేపల్లి సంపతరావు, మానేపల్లి ప్రభాకరరావు తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలకు 52 కేంద్రాలు

భీమవరం: జిల్లాలో మార్చి 1 నుంచి నిర్వహించనున్నట్లు జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాశాఖాధికారి ఎ.నాగేశ్వరరావు తెలిపారు. ఆదివారం భీమవరం కేజీఆర్ఎల్ జూనియర్ కళాశాలలో అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. జిల్లాలో 52 కేంద్రాలు, 13 స్టోరేజ్ పాయింట్లు ఏర్పాటుచేశామన్నారు. మూడు ఫ్లయింగ్ స్క్వాడ్లు, మూడు సిట్టింగ్ స్క్వాడ్లు తనిఖీలు చేస్తాయన్నారు. ఫస్టియర్ పరీక్షలకు 19,708 మంది, సెకండియర్ పరీక్షలకు 18,213 మంది విద్యార్థులు హాజరుకానున్నారన్నారు.

మధ్యాహ్న భోజనంలో మార్పులు

- ఇకపై జోన్ల వారీగా అమలు
- నేటి నుంచి కొత్త మెనూ
- ఏప్రిల్ 23 వరకు ట్రయల్‌రన్



కొమ్మరలో విద్యార్థులకు భోజనం వడ్డిస్తున్న దృశ్యం

నిడమర్రు: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనం పథకంలో సోమవారం నుంచి జోన్ల వారీగా మెనూ అమలు చేయనున్నారు. కొత్త మెనూను ఏప్రిల్ 23 వరకు ట్రయల్‌రన్ నిర్వహించనున్నారు. చివరిలో అభిప్రాయాలు సేకరించి మార్పులపై విద్యాశాఖ నిర్ణయం తీసుకోనుంది. ప్రాంతాల వారీగా ఆహారపు అలవాట్లకు ప్రాధాన్యమిస్తూ రాష్ట్రంలో నాలుగు జోన్లగా నిర్ధారించారు. జోన్–2లో ఉమ్మడి ఉభయగోదావరి, కృష్ణా జిల్లాలు ఉన్నాయి. ఈ మేరకు ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా జోన్–2 పరిధిలోకి వచ్చాయి.

జోన్–2 కొత్త మెనూ
- **సోమవారం..** అన్నం, కూరగాయలు లేదా ఆకుకూర పప్పు, ఫ్రై చేసిన గుడ్డు, బెల్లం చిక్కీ.
- **మంగళవారం..** పులిహోరా, ఉడికించిన గుడ్డు, చట్నీ, రాగిజావ.
- **బుధవారం..** అన్నం, మిక్స్‌డ్ వెజిటబుల్ కూర, ఫ్రై చేసిన గుడ్డు, బెల్లం చిక్కీ.
- **గురువారం..** కూరగాయల అన్నం లేదా వెజ్ పలావు, ఆలూ కుర్మా, ఉడికించిన కోడిగుడ్డు, రాగిజావ.
- **శుక్రవారం..** అన్నం, ఆకుకూర పప్పు, ఫ్రై చేసిన గుడ్డు, బెల్లం చిక్కీ.
- **శనివారం..** అన్నం, మిక్స్‌డ్ వెజిటబుల్ కూర, స్వీట్ పొంగలి, రాగిజావ

నిర్వహణ ఖర్చులు పెంచలేదు

జోన్–2 మెనూలో సాంబారు, పప్పు చారు లేవు. ఇప్పటివరకు అమలు చేసిన మెనూ ప్రకారం గురువారం సాంబారు, శనివారం పప్పు చారును వడ్డిస్తున్నారు. అధికారులు పెరుగుతున్న నిత్యావసర సరుకుల ధరలకు అనుగుణంగా నిర్వహణ ఖర్చులపై శ్రద్ధ పెట్టాలని ఎండీఎం నిర్వహణ ఏజెన్సీ సభ్యులు కోరుతున్నారు. నిర్వాహకులకు గౌరవ వేతనం రూ.3 వేల నుంచి రూ.5 వేలకు పెంచాలని డిమాండ్ ఉంది. ప్రస్తుతం ఖర్చుల నిమిత్తం 1 నుంచి 5వ తరగతి విద్యార్థికి రూ.5.13 పైసలు, 6 నుంచి 10వ తరగతి విద్యార్థికి రూ.8.57 పైసలు ప్రభుత్వం అందిస్తోంది.

అభిప్రాయాలు సేకరించాం



నూరుశాతం ఎండీఎం హాజరు ఉండేలా మెనూలో స్వల్ప మార్పులు జరిగాయి. ఇప్పటివరకూ అమలవుతున్న మెనూపై విద్యార్థులు, వారి తల్లిదండ్రుల అభిప్రాయాలు తీసుకుని ఉన్నతాధికారులకు అందించాం. కొత్త మెనూ వేసవి సెలవులు వరకూ అమలు చేయాలి.
– ఏపీఎస్ఎస్ భాస్కరకుమార్, ఎంఈఓ–2, నిడమర్రు

నిధులు పెంచాలి



కొత్త మెనూలో సాంబారు బదులు కూరగాయలతో చేసిన కూరలు వండాలి. ఇటీవల కూరగాయల ధరలు బాగా పెరిగాయి. కిరాణా సరుకుల ధరలతోపాటు గ్యాస్ ధరలు భారంగా ఉన్నాయి. ఈ మేరకు నిర్వహణ ఖర్చుల విషయంలో అధికారులు ధరలను పరిగణనలోకి తీసుకోవాలి.
– కాసాని సత్తెమ్మ, ఎండీఎం నిర్వహకురాలు, కొమ్మర

గౌరవ వేతనం పెంచాలి



మధ్యాహ్న భోజన పథకంలో సహాయకులకు గౌరవ వేతనం పెంచాలని కార్మిక సంఘాల తరఫున ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నాం. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు హెల్పర్లు పనిచేయాలి. గౌరవ వేతనం నాలుగైదు నెలలు ఇవ్వని సందర్భాలు ఉన్నాయి.
– కమ్ముల నాగేంద్ర, సీఐటీయూ నాయకులు



ఏలూరు సీఆర్‌రెడ్డి కళాశాలలో పరీక్షా కేంద్రం వద్ద అభ్యర్థులు



పరీక్షా కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి

ప్రశాంతంగా గ్రూప్–2



మెటల్ డిటెక్టర్‌తో తనిఖీలు



అభ్యర్థుల సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకుంటున్న సిబ్బంది

ఏలూరు(మెట్రో) : ఏలూరులో గ్రూప్–2 మెయిన్స్ పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. ఆదివారం ఏలూరులోని 6 కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. అభ్యర్థులకు రవాణా సౌకర్యంతో పాటు కేంద్రాలకు సరైన సమయంలో చేరుకునేలా లైజన్ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. జేసీ పి.ధాత్రిరెడ్డి కో–ఆర్డినేషన్ అధికారిగా వ్యవహరించారు. మూడు కేంద్రాలను కలెక్టర్ కె.వెట్రిసెల్వి పరిశీలించారు. ఉదయం సెషన్‌లో 4,415 మంది అభ్యర్థులకు 3,881 మంది (87.90 శాతం), మధ్యాహ్నం సెషన్‌లో 4,415 మందికి 3,878 మంది (87.81 శాతం) హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 534 మంది, మధ్యాహ్నం సెషన్‌లో 537 మంది అభ్యర్థులు పరీక్షలకు గైర్హాజరయ్యారు.

సెంటర్ల వారీగా హాజరు

సీఆర్ రెడ్డి ఇంజనీరింగ్ కాలేజీలో 2,210 మందికి 1,925 మంది, సీఆర్‌రెడ్డి పాలిటెక్నికల్ కళాశాలలో 480 మందికి 430 మంది, సీఆర్ రెడ్డి డిగ్రీ అటానమస్ కాలేజీలో 480 మందికి 439 మంది, సీఆర్‌రెడ్డి మహిళా కళాశాలలో 480 మందికి 431 మంది, ఏలూరు కాలేజ్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో 480 మందికి 423 మంది, సెయింట్ థెరిస్సా మహిళా కళాశాలలో 285 మందికి 233 మంది హాజరయ్యారు.



కేంద్రంలోకి వెళుతున్న అభ్యర్థులు

సాంకేతిక సంబరం.. విజ్ఞాన వికాసం

- నూజివీడు ట్రిపుల్‌ఐటీలో టెక్‌జైట్–25
- 25 నుంచి జాతీయ స్థాయి ఫెస్ట్



టెక్‌జైట్ లోగో

నూజివీడు : నూజివీడు ట్రిపుల్ ఐటీలో ఈనెల 25 నుంచి 27 వరకు జాతీయస్థాయి టెక్నికల్ ఫెస్ట్‌ను టెక్‌జైట్–25 పేరుతో నిర్వహించడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. ఫెస్ట్‌ను క్యాంపస్‌లోని స్టూడెంట్ డెవలప్‌మెంట్ క్యాంపస్ యాక్టివిటీ సెల్ (ఎస్‌డీసీఏసీ) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. టెక్‌జైట్‌లో ట్రిపుల్ ఐటీకి చెందిన ఎనిమిది వేల మందితో పాటు దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చే రెండు వేల మంది కలిపి 10 వేల మంది విద్యార్థులు పాల్గొనేలా ఏర్పాట్లు చేస్తున్నారు. దీనిలో భాగంగా దేశవ్యాప్తంగా ఉన్న అన్ని యూనివర్సిటీలకూ ఆహ్వానాలు పంపడంతో పాటు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ల ప్రక్రియ సైతం అందుబాటులో ఉంచారు. గతంలో నిర్వహించిన టెక్‌ఫెస్ట్‌లకు భిన్నంగా నూతన పంథాలో నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నారు.

దక్షిణ భారతదేశంలోనే భారీగా..

దక్షిణ భారతదేశంలోనే అతి పెద్ద సాంకేతిక ఉత్సవంగా ఇది నిలవనుంది. టెక్‌జైట్ వల్ల విద్యార్థుల్లో సాంకేతిక సృజనాత్మకత పెరగడమే కాకుండా పరిశోధన సామర్థ్యాలు మెరుగుపడనున్నాయి. కోడింగ్ సవాళ్లు, రోబోటిక్స్ పోటీలు, సర్క్యూట్ డిజైనింగ్, హ్యాకథాన్‌ల వరకు వివిధ సాంకేతిక పోటీల్లో విద్యార్థులు పాల్గొంటారు. పలు రంగాల్లో విశేష అనుభవం కలిగినవారు, విజయాలను సాధించిన నిష్ణాతులతో వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులకు ప్రసంగాలను సైతం ఏర్పాటుచేశారు. ట్రిపుల్‌ఐటీలోనే చదువుకుని వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిలో ఉన్న పూర్వ విద్యార్థులతో కూడా పలు కార్యక్రమాలను నిర్వహించనున్నారు.

విద్యార్థులకు పోటీలు

ఇంజినీరింగ్ విద్యార్థులకు పలు రకాల పోటీలను ఏర్పాటు చేస్తున్నారు. మెగా ఎక్స్‌పో, హ్యాకథాన్, వర్క్‌షాప్‌లు, ఈవెంట్లు, రోబో వార్స్ వంటి పోటీలు నిర్వహించనున్నారు. అలాగే క్విజ్ పోటీలు, ఐపీఎల్ ఆక్షన్, ఫ్రీ ఫైర్, ఐఏఎస్ పోటీలు మరింత ఆకర్షణగా నిలవనున్నాయి. డిపార్ట్‌మెంట్‌ల వారీగా వర్క్‌షాప్‌లను ఏర్పాటు చేయనున్నారు. సాంకేతిక రంగంలో వస్తున్న తాజా పురోగతులు, కెరీర్ మార్గదర్శకత్వం, వివిధ రంగాల్లో వస్తున్న నూతన ధోరణులు సహా పలు రకాల అంశాలు టెక్‌జైట్‌లో ఉన్నాయి.

మెటావర్స్ థీమ్‌తో..

మెటావర్స్ థీమ్‌తో టెక్‌జైట్‌ను నిర్వహిస్తున్నారు. అగ్మెంటెడ్ రియాలిటీ, వర్చువల్ రియాలిటీ గురించి విద్యార్థులకు మరింత విజ్ఞానాన్ని పెంపొందించడమే లక్ష్యంగా ఈ థీమ్‌ను రూపొందించారు. 'నేడు ఉన్న టెక్నాలజీ రేపటికి పాతదైపోతున్న నేటి ఆధునిక యుగంలో రాబోయే రోజులన్నీ ఈ మెటావర్స్‌దే' అన్న ఉద్దేశంతో మెటావర్స్ థీమ్‌గా తీసుకున్నారు.

క్లుప్తంగా

పెద్దింట్లమ్మ దేవస్థానం వద్ద భక్తుల రద్దీ



కొల్లేటికోట పెద్దింట్లమ్మ దేవస్థానం అనివేటి మండపం వద్ద భక్తులు

కైకలూరు: పెద్దింట్లమ్మ జాతర(తీర్థం) దగ్గర పడుతున్న నేపథ్యంలో భక్తులు సంఖ్య పెరుగుతోంది. కొల్లేటికోట పెద్దింట్లమ్మ తల్లిని సమీప జిల్లాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు ఆదివారం దర్శించుకున్నారు. కోనేరులో స్నానాలు ఆచరించి అమ్మవారికి మొక్కులు సమర్పించారు. మహిళలు పాలపొంగళ్లు అందించారు. అమ్మవారికి ఆలయ ప్రధాన అర్చకుకు పేటేటి పరమేశ్వరశర్మ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో కూచిపూడి శ్రీనివాసు మాట్లాడుతూ ఒక్క ఆదివారం రోజున ప్రత్యేక, అంతరాలయ దర్శనాలు, పెద్ద, చిన్న తీర్థాలు, కేశఖండన, లడ్డు ప్రసాదం, గదుల అద్దెలు, అమ్మవారి ప్రతిమల అమ్మకం, వాహన పూజల ద్వారా రూ.51,780 ఆదాయం వచ్చిందని చెప్పారు.

శ్రీవారి సేవలో పంచాయతీరాజ్ డైరెక్టర్



పంచాయతీరాజ్ డైరెక్టర్ కృష్ణ తేజకు స్వామి చిత్రపటాన్ని అందజేస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల ఆలయాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణ తేజ ఆదివారం సందర్శించారు. కుటుంబ సమేతంగా ఆలయానికి విచ్చేసిన ఆయనకు మర్యాద పూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేష వస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలికారు.

మెయిన్స్‌లో టాపర్స్‌గా తిరుమల విద్యార్థులు



కె.సాయిస్పజన



కె.ప్రణీత్

రాజమహేంద్రవరం రూరల్: దేశవ్యాప్తంగా విడుదల చేసిన జేఈఈ మెయిన్స్ బీ ఆర్క్, బీ ప్లానింగ్ ఫలితాలలో తిరుమల ఐఐటీ అండ్ మెడికల్ అకాడమీ విద్యార్థులు ఆలిండియా టాపర్స్‌గా నిలిచారని విద్యాసంస్థల చైర్మన్ నున్న తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. బీ ప్లానింగ్ విభాగంలో ఓబీసీ కేటగిరిలో కె.సాయిస్పజన 99.99 పర్సంటైల్ సాధించి ఆలిండియా టాపర్‌గా రావడమే కాకుండా ఆంధ్రప్రదేశ్ టాపర్‌గా నిలిచిందన్నారు. మరో విద్యార్థి కె.ప్రణీత్ ఎస్సీ కేటగిరిలో ఆలిండియా టాపర్‌గా నిలిచాడని తెలిపారు. విద్యార్థులను నున్న తిరుమలరావు, అకడమిక్ డైరెక్టర్ జి.సతీష్‌బాబు, ప్రిన్సిపాల్ వి.శ్రీహరి అభినందించారు.

క్షీరారామంలో శివరాత్రి శోభ

ప్రారంభమైన ఉత్సవాలు

పాలకొల్లు సెంట్రల్: పంచారామక్షేత్రాల్లో ఒకటైన పాలకొల్లు శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో శివరాత్రి కోసం ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. స్వామి సన్నిదిలో ఒకరోజు నిద్రిస్తే లభించే పుణ్యం వారణాసిలో ఏడాది ఉంటే కలిగే పుణ్యంతో సమానమని ప్రతీతి. కార్తీక మాసం, మహాశివరాత్రి, ఇతర పండగ రోజుల్లో స్వామివారిని దర్శించుకోవడానికి పెద్ద సంఖ్యలో భక్తులు వస్తుంటారు. ఆలయంలో సరస్వతీదేవి, మహిషాసురమర్దని, గోకర్ణేశ్వరస్వామి, వినాయకుడు, శనీశ్వరుడు, కాశీవిశ్వేశ్వరుడు, నగరేశ్వరుడు, కుమారస్వామి, వీరభద్రుడు, కాలభైరవుడు, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి, పంచముఖ లక్ష్మీగణపతి, బ్రహ్మ, ఆంజనేయస్వామి ఉపాలయాల్లో కొలువై ఉన్నారు.

ఈ ఆలయం పంచాయతన ఆలయంగా ప్రసిద్ధి. ఆలయంలో స్వామివారిని దర్శించుకోవడానికి గాలిగోపురం నుండి ఐదు ద్వారాలు ఉంటాయి. ఐదు నందులు, ఐదు గణపతులు, వరుసగా ఐదు ఆలయ శిఖరాలు, ఐదుగురు అమ్మవార్లు, ఐదు మండపాలు, ఐదు శివలింగాలు దర్శనమిస్తాయి.

120 అడుగుల గాలిగోపురం

ఆలయ ముఖ ద్వారంలో 120 అడుగుల ఎత్తున తొమ్మిది అంతస్తులతో గాలిగోపురం ఉంటుంది. గోపురంపైన ఉన్న శిఖరాలను దర్శించుకోవడానికి లోపల మెట్ల మార్గం ఉంది. స్వామికి ప్రతీ సోమవారం రాత్రి 7.30 గంటలకు పంచహారతులు ఇస్తారు. ప్రతీ నెలా మాసశివరాత్రి రోజున లీలాకళ్యాణం, లక్ష్మీపార్వతి అమ్మవార్లకు 108 బంగారు పుష్పాలతో అష్టోత్తర పూజలు, లక్ష ముత్యాల పూజ, ప్రతీ సోమవారం గోపూజ, ప్రతీ పౌర్ణమి నాడు చండీహోమం నిర్వహిస్తుంటారు.



క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం

భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు

క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో ఈ నెల 23 నుంచి 27 వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించనున్నారు. ఉత్సవాలు పురస్కరించుకుని భక్తుల సౌకర్యార్థం ఆలయంలో ఏర్పాట్లు పూర్తి చేశారు. ఈ సందర్భంగా ఆలయంలో విద్యుత్ దీపాలంకరణలు, క్యూలైన్లు ఏర్పాటు చేశారు. 23న ఆదివారం ఉదయం నుంచి అభిషేకాలు, కుంకుమ పూజలు, రుద్రహోమం, సాయంత్రం 5 గంటలకు ముత్యాల పూజ, 6 గంటలకు లీలాకళ్యాణం నిర్వహించారు. సోమవారం అభిషేకాలు, కుంకుమపూజలు, లక్షపత్రి పూజ, లక్ష కుంకుమపూజలు, మంగళవారం అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహిస్తారు. 26న బుధవారం మహాశివరాత్రి పురస్కరించుకుని వేకువజాము 4 గంటల నుంచి స్వామివారి దర్శనం ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం 12 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకూ స్వామికి అభిషేకాలు నిర్వహిస్తారు. రాత్రి 8.35 గంటలకు జ్యోతి వెలిగిస్తారు. రాత్రి 12 గంటలకు లింగోద్భవ సమయంలో దగ్గులూరు వరదా సోమేశ్వరరావు నేచిన మల్లన్న పాగాను స్వామికి అలంకరించనున్నారు. అనంతరం లక్షపత్రి పూజ నిర్వహిస్తారు. రాత్రి 7 గంటల నుంచి సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయి.



క్షీరారామలింగేశ్వర స్వామి



పార్వతీదేవి

ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశాం



భక్తులకు ఉచిత దర్శనంతో పాటు ప్రత్యేక దర్శనం ఏర్పాటు చేశారు. అభిషేకాలకు రుసుం రూ.100 చెల్లించాలి. చిన్న పిల్లలకు పాలు, భక్తులకు వాటర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాం.

ముచ్చర్ల శ్రీనివాసరావు, ఆలయ ఈవో, పాలకొల్లు

ట్రాఫిక్ మళ్లింపు



భక్తుల బైక్‌లు, కార్ల పార్కింగ్ నిమిత్తం మార్కెట్ యార్డు, శనివారం సంత రోడ్డు, లయన్స్ కమ్యూనిటీ హాలు రోడ్డులో ఏర్పాట్లు చేస్తున్నాం. మెయిన్‌రోడ్డులో వీనస్ లాడ్జి, బొమ్మన క్లాత్ మందిర్, కారుమూరి వారి వీధిలో కోర్టు వీధి వద్ద ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నాం.

కె.రజనీకుమార్, పట్టణ సీఐ, పాలకొల్లు

గోపవరంలో చోరీ

కైకలూరు: ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు బంగారాన్ని చోరీ చేసిన ఘటన కైకలూరు మండలం గోపవరంలో శనివారం రాత్రి జరిగింది. కైకలూరు టౌన్ పోలీసుల వివరాల ప్రకారం గోపవరం గ్రామానికి చెందిన మాగంటి కాత్యాయని భర్త మరణించడంతో ఇద్దరు కుమారులతో ఉంటుంది. కుమారులతో కలసి ఆమె శనివారం సాయంత్రం 4 గంటలకు ద్వారకాతిరుమల వెళ్ళింది. రాత్రి 10.30 గంటలకు వచ్చి ఇంట్లోకి వెళ్ళి చూడగా బీరువా తలుపులు తీసి ఉన్నాయి. 30 గ్రాముల బంగారు అభరణాలు చోరీకి గురయ్యాయని కాత్యాయని ఫిర్యాదుపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వేధింపులపై కేసు నమోదు

జంగారెడ్డిగూడెం: ఇన్‌స్టా ద్వారా ఒక యువకుడిని వేధిస్తున్న నేరంపై ఒక వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై షేక్ జబీర్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలో ఓ ప్రైవేట్ కళాశాలలో ఇంటర్ సెకండియర్ చదువుతున్న యువకుడిని సివంగి జస్వంత్ వేధిస్తున్నాడు. యువకుడి ఇన్‌స్టా ఐడీలో సదరు యువకుడిని అశ్లీలంగా మార్ఫి పోస్ట్ చేస్తూ, అసభ్యకరంగా మెసేజ్‌లు పెట్టేవాడు. యువకుడు తీవ్ర మనస్తాపానికి గురవుతున్నాడని గమనించిన తల్లి జస్వంత్‌పై ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేసిందన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ప్రైవేట్ ఆస్పతిలో అగ్నిప్రమాదం

ద్వారకాతిరుమల: మండలంలోని ఎం.నాగులపల్లి పంచాయతీ పరిధి ద్వారకానగర్‌లోని ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఆదివారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. డాక్టర్ బాలు ఆస్పత్రిలో సోలార్ యుపిఎస్ బోర్డు వద్ద విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరిగింది. దాంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించి, పొగ చుట్టుముట్టడంతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న భీమడోలు అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు.

వీరంపాలెం ముస్తాబు

ఈ నెల 25 నుంచి శివరాత్రి ఉత్సవాలు ప్రారంభం

తాడేపల్లిగూడెం రూరల్ : రెండో కాశీగా విరాజిల్లుతున్న వీరంపాలెం శైవక్షేత్రం శివరాత్రికి ముస్తాబవుతుంది. ఇక్కడ కార్తీక పౌర్ణమి, మహాశివరాత్రి పర్వదినాలను అత్యంత వైభవంగా నిర్వహిస్తారు. మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా వీరంపాలెం శైవక్షేత్రం అత్యంత శోభాయమానంగా రూపుదిద్దుకుంటోంది. తాడేపల్లిగూడెం మండలం వీరంపాలెంలోని శ్రీబాలాత్రిపుర సుందరి విద్యా, ఆధ్యాత్మిక పీఠంలో అష్టముఖ మహాగణపతితో పాటు 42 అడుగుల శివపార్వతుల దివ్య మంగళ విగ్రహాలు, 24 అడుగుల ఎత్తులో మహాలింగం, 42 అడుగుల భగీరథుడి విగ్రహం ఏర్పాటు చేశారు. ఈ క్షేత్రంలో స్పటిక లింగంతో పాటు లింగాకారంలో విశ్వేశ్వరుడు కొలువై ఉన్నాడు. భగీరథుడి విగ్రహం, ఆకాశ లింగం, మేధాసరస్వతీ ఆలయం, వేదమాత గాయత్రీ దేవీ ఆలయం, ధ్యాన మందిరం విశేషంగా చెప్పుకోవచ్చు. మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి రోజుల్లో విశేషంగా భక్తులు ఈ క్షేత్రానికి క్యూ కడుతుంటారు. ఆయా రోజుల్లో ఇక్కడ ఏర్పాటు చేసిన స్పటిక లింగాన్ని దర్శించుకునేందుకు రాష్ట్రం నలుమూలల నుంచి భక్తులు తరలిరావడం విశేషం. వారణాసి తర్వాత ఇన్ని విశిష్టతలు కలిగిన ఆలయం లేకపోవడంతో దేశంలోనే రెండవ కాశీగా వీరంపాలెం శైవక్షేత్రం విరాజిల్లుతోంది. ఈ నెల 25 నుంచి 27 వరకూ మహాశివరాత్రి ఉత్సవాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు.

లక్ష లింగాల మధ్య స్పటిక లింగం

లక్ష లింగాల మధ్య కొలువైన ఏకై క స్పటిక ఆలయం వీరంపాలెంలోనే ఉంది. దాదాపు తొమ్మిది రాష్ట్రల్లో ఎక్కడా లేని విధంగా ఇక్కడ స్పటిక లింగాన్ని ఏర్పాటు చేశారు. ఏటా మహాశివరాత్రి, కార్తీక పౌర్ణమి రోజున భక్తుల సౌకర్యార్థం స్పటిక లింగాన్ని దర్శించే అవకాశం కల్పిస్తారు. స్పటిక లింగాన్ని దర్శించడం వల్ల సకల పాపాలు తొలగిపోతాయని భక్తుల విశ్వాసం. దీంతో తాడేపల్లిగూడెంతో పాటు జిల్లా, ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు తరలివస్తుంటారు.



స్పటికలింగం నెలవైన ప్రాంతం



వీరంపాలెం శైవక్షేత్రంలో కొలువైన మహాలింగం



పార్వతీ పరమేశ్వరుల దివ్యమంగళ విగ్రహం

మహాశివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నాం



వీరంపాలెం శైవక్షేత్రంలో మహాశివరాత్రికి ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఆలయ సేవా కార్యకర్తలను ఇప్పటికే సిద్ధం చేశాం. అరగంట వ్యవధిలోనే స్వామివారి దర్శన భాగ్యం కల్పిస్తాం.

– గరిమెళ్ళ వెంకటరమణశాస్త్రి, శ్రీబాలాత్రిపుర సుందరీ పీఠం వ్యవస్థాపకుడు, వీరంపాలెం

అంతర్ జిల్లా దొంగల అరెస్టు

భీమవరం: బైక్‌లు, బంగారం దొంగతనాలకు పాల్పడుతున్న ఆరుగురు అంతర్ జిల్లా దొంగలను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.10.20 లక్షల విలువైన సొత్తును రికవరీ చేశామని అడిషనల్ ఎస్పీ వి.భీమారావు తెలిపారు. ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. రాయలం గ్రామానికి చెందిన అనుపోజు కృష్ణవంశీ, చాగల్లుకు చెందిన డొక్కు సాయికిరణ్ ఇంటి తాళాలు బద్దలు కొట్టి బంగారు ఆభరణాలు, సెల్‌ఫోన్‌లు, నగదు, మోటార్ సైకిళ్ల దొంగతనాలకు పాల్పడేవారు. వీరికి ఆకివీడు మండలం తాళ్లకోడుకు చెందిన నరమామిడి హరిబాబు వసతి కల్పించి వారి నుంచి చోరి సొత్తును తీసుకుంటాడు. ఈ ముగ్గురితోపాటు భీమవరం రూరల్ స్టేషన్ పరిధిలో దొంగతనాలకు పాల్పడుతున్న రూరల్ మండలం దేగాపురానికి చెందిన ఓలేటి దుర్గా మల్లేశ్వరరావు, వన్‌టౌన్‌కు చెందిన దగరపు ఎలియాజర్, మైనర్ బాలుడిని అరెస్ట్ చేశామన్నారు. నిందితుల నుంచి 6 మోటార్ సైకిళ్లు, 33 గ్రాముల బంగారం, 500 గ్రాముల వెండి, 3 సెల్ ఫోన్‌లు, రూ.85,070 నగదు రికవరీ చేశామని, వీటి మొత్తం విలువ రూ.10,20,000 ఉంటుందని భీమారావు స్పష్టం చేశారు. ప్రతిభ కనబర్చిన అధికారులు, సిబ్బందికి అభినందలు తెలిపారు.



భీమవరంలో వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ ఎస్పీ వి.భీమారావు

భక్తుల పాదాలకు రక్షణగా



ఎండలు ప్రారంభమయ్యాయి. దాంతో శ్రీవారి క్షేత్రానికి వచ్చే భక్తుల పాదాలకు రక్షణ కల్పించేందుకు దేవస్థానం అధికారులు ఆదివారం చర్యలు చేపట్టారు. అందులో భాగంగా ఆలయ ప్రధాన రాజగోపుర మెట్లపై నీరు పారేలా ఏర్పాటు చేశారు. మెట్ల మార్గంలో రంధ్రాలతో ఉన్న పైప్‌లైన్‌ల ద్వారా ఈ నీటిని సరఫరా చేస్తున్నారు. వేసవి ముగిసే వరకు మెట్లపై నీటిని వదులుతామని, ఇప్పటికే దర్శనం క్యూలైన్ల వద్ద కూలర్లు ఏర్పాటు చేశామని అధికారులు తెలిపారు.

–ద్వారకాతిరుమల

పురుగుల మందు తాగిన వ్యక్తి మృతి

జంగారెడ్డిగూడెం: పురుగుల మందు తాగి లక్కవరం గ్రామానికి చెందిన నేరుసు రమేష్(34) వైద్యం పొందుతూ మృతిచెందాడు. జంగారెడ్డిగూడెం మండలం లక్కవరం గ్రామానికి చెందిన నేరుసు రమేష్ వ్యక్తిగత కారణాలతో మనస్థాపానికి గురై 18 రోజుల క్రితం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. కుటుంబ సభ్యులు జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. అక్కడి నుంచి విజయవాడ తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతిచెందాడు.

పట్టిసంలో సర్వం సిద్ధం



గోదావరి నదిలో పంట్లుతో ఏర్పాటు చేసిన వారధి



శివక్షేత్రం వద్ద షామియానాలతో ఏర్పాటు చేసిన క్యూలైన్

పోలవరం రూరల్: మహాశివరాత్రి ఉత్సవాలకు పట్టిసం క్షేత్రం సిద్ధమైంది. మూడు రోజుల పాటు ఇసుక తిన్నెలపై జరిగే ఈ ఉత్సవాలు వీక్షించేందుకు లక్షమందికి పైగా భక్తులు హాజరవుతారనే అంచనాతో అధికార యంత్రాంగం పనులు చేపట్టింది. కాలినడకన క్షేత్రానికి వెళ్లి వచ్చేలా గోదావరి నదిలో పంట్లు, ఇసుకతో ఫ్లాట్‌ఫాంలతో వారధిని నిర్మించారు. భక్తులు అక్కడక్కడ సేద తీరేందుకు వీలుగా దారి పొడవునా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఇసుకలో వృద్ధులు, మహిళలు పిల్లలు నడిచి వెళ్లేందుకు వీలుగా ఇసుక బస్తాలతో ఫ్లాట్‌ఫాం నిర్మించారు. నది ఒడ్డున కర్రలతో స్నానఘట్టాలు, మహిళలు దుస్తులు మార్చుకునేందుకు తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. భక్తులు సౌకర్యార్థం పలు రకాల చిరు దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారు. పట్టిసం పంపింగ్ స్కీమ్ నుంచి పట్టిసం ఎత్తిపోతల పథకం వరకు ఏటిగట్టుపై విద్యుత్‌లైట్లు అమర్చే పనులను చేపడుతున్నారు. ఆదివారం ఏర్పాట్లను డీఎస్పీ ఎం.వెంకటేశ్వరరావు, సీఐ బాల సురేష్ పరిశీలించి బందోబస్తు పరిశీలించారు. దేవస్థానం వద్ద ఈవో చాగంటి సురేష్ నాయుడు దర్శనానికి వీలుగా ఏర్పాట్లు చేపట్టారు.

సుందరగిరిపై మహా యజ్ఞానికి అంకురార్పణ

ద్వారకాతిరుమల: మండలంలోని ఐఎస్ జగన్నాథపురంలో సుందరగిరిపై స్వయంభూగా కొలువైన శ్రీ కనకవల్లీ సమేత శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో అతి రుద్ర ప్రయోగ సహిత సుదర్శన నృసింహ 31వ మహాయజ్ఞ క్రతువుకు ఆదివారం అంకురార్పణ జరిగింది. ముందుగా ఆలయ యాగశాలలో యజ్ఞ నిర్వాహకులు కొచ్చర్లకోట సత్యవెంకట లక్ష్మీనరసింహ గురుజీ ఆధ్వర్యంలో, సీహెచ్ కుటుంబరావు పర్యవేక్షణలో పండితులు, రుత్వికులు అంకురార్పణ వేడుకను ఘనంగా జరిపి, యజ్ఞ క్రతువుకు శ్రీకారం చుట్టారు. అనంతరం యాగశాలలోని వేదికపై పలు దేవతా మూర్తుల విగ్రహాలను ఏర్పాటు చేసి, 1,331 కలశాలతో కలశస్థాపన జరిపారు. అలాగే ఈనెల 26 న రాత్రి శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని జరిపే మహా యజ్ఞానికి సంబంధించిన ప్రధాన హోమగుండాన్ని మహిళలు ముస్తాబు చేస్తున్నారు. సాయంత్రం యాగశాలలో పండితులు, రుత్వికులు వేద మంత్రోచ్ఛరణలతో మహా పూర్ణాహుతి వేడుకను వైభవంగా నిర్వహించారు.



మహాపూర్ణాహుతి వేడుక నిర్వహిస్తున్న పండితులు



యాగశాలలో కలశస్థాపన

జేఈఈ మెయిన్స్‌లో షిర్డీసాయి విద్యార్థికి ప్రథమ స్థానం

కంబాలచెరువు(రాజమహేంద్రవరం): జేఈఈ మెయిన్స్ బి ప్లానింగ్‌కు ఆదివారం వెలువడిన ఫలితాలలో శ్రీ షిర్డీ సాయి జూనియర్ కళాశాల విద్యార్థి ఆలిండియా ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నట్టు శ్రీషిర్డిసాయి విద్యాసంస్థల డైరెక్టర్ టి.శ్రీవిద్య తెలిపారు. తమ లక్ష్య ఐఐటీ అకాడమీలో శిక్షణ పొందుతున్న ఐ.శ్రీ సాయి హిమ్నిష్ పీడబ్ల్యూడీ కేటగిరిలో జాతీయ స్థాయిలో ప్రథమ స్థానాన్ని సాధించినట్లు తెలిపారు. విద్యాసంస్థల చైర్మన్ తంబాబత్తుల శ్రీధర్ మాట్లాడుతూ హిమ్నిష్ ఆరో తరగతి నుంచి తమ పాఠశాలలోనే లక్ష్య ప్రోగ్రాంలో చదివి ఈ ఘనత సాధించడంపై హర్షం వ్యక్తం చేశారు.



సాయి హిమ్నిష్‌ను అభినందిస్తున్న విద్యాసంస్థల చైర్మన్ శ్రీధర్, డైరెక్టర్ శ్రీవిద్య

క్లుప్తంగా

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో చదరంగం పోటీలు



తణుకులో చదరంగంలో గెలుపొందిన విద్యార్థులతో రోటరీ క్లబ్ ప్రతినిధులు

తణుకు అర్బన్: వరల్డ్ రోటరీ డే సందర్భంగా తణుకు రోటరీ క్లబ్‌లో ఆదివారం చదరంగ పోటీలు నిర్వహించారు. తణుకు పట్టణంలోని వివిధ పాఠశాలలకు చెందిన 3 నుంచి 8వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో 150 మంది విద్యార్థులు హాజరైనట్లు క్లబ్ అధ్యక్షుడు ఆనందం మస్తానరావు (బాబి) తెలిపారు. విజేతలకు మెమెంటోలు, సర్టిఫికెట్స్, మెడల్స్ అందజేశారు. అనంతరం చదరంగం మాస్టర్ చరణ్‌ను క్లబ్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో నాయకులు గమిని రాంబాబు, ఆకెళ్ల సుబ్రహ్మణ్యం, రెడ్డి రంగారావు, వి.పార్వతి, అధికారి ప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు వైద్య సేవలు



తణుకులో వైద్య సేవలందిస్తున్న వైద్యులు

తణుకు అర్బన్: సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, నిసా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో ఆదివారం ఇంటికే పరిమితమైన వృద్ధులకు ఉచిత వైద్య సేవలందించారు. తణుకు, వెంకటరాయపురం, సజ్జాపురం ప్రాంతాల్లోని 8 మంది ఇంటికి పరిమితమైన వృద్ధుల వద్దకు వెళ్లిన ప్రముఖ సీనియర్ నేత్ర వైద్యుడు హుస్సేన్ అహ్మద్, ఆర్థో వైద్యుడు నిమ్మగడ్డ అచ్యుతరామయ్య వైద్యసేవలందించారు. వేల్పూరుకు చెందిన ఆరిమిల్లి చక్రధరరావు ఆర్థిక సాయంతో ఉచితంగా మందులు పంపిణీ చేసినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు అల్లూరి కరుణాకరచౌదరి తెలిపారు. ఉచిత వైద్యసేవలు అవసరమైన వారు 99853 43530, 9059290717 నంబర్లకు ఫోన్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సభ్యులు గిరిజాల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పేదలకు బియ్యం పంపిణీ



నెలవారీ బియ్యం పంపిణీ చేస్తున్న గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్

తాడేపల్లిగూడెం (టీఓసీ): గ్లోబల్ సపోర్ట్ ఆర్గనైజేషన్ ఫౌండర్ చెన్న త్రికల సేవలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నెలవారీ బియ్యం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. లార్డ్ ఆఫ్ లైఫ్ చిల్డ్రన్ హోమ్‌కు 150 కేజీలు, నిడదవోలు లెప్రర్స్ కాలనీ వారికి 300 కేజీలు, పడాల జీవన సంధ్యా వృద్ధాశ్రమానికి 20 కేజీలు అందజేశారు. ట్రస్టీ, వైఎస్సార్ సీపీ నాయకులు చెన్న జనార్ధనరావు ఆధ్వర్యంలో ఈ సేవా కార్యక్రమం నిర్వహించారు. సేవలు అందుకున్న నిర్వాహకులు ఆర్గనైజేషన్‌కు, దాతలకు కృతజ్ఞతలు వెల్లడించారు. దుర్గా ప్రసాద్, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్‌ను నిషేధించాలి



క్లాత్ బ్యాగులను అందజేస్తున్న ఇన్‌చార్జి ఎంపీడీవో విశ్వనాథ్

తాడేపల్లిగూడెం రూరల్: పర్యావరణ పరిరక్షణకు ప్లాస్టిక్‌ను ప్రతి ఒక్కరూ నిషేధించాలని ఇన్‌చార్జి ఎంపీడీవో ఎం.వెంకటేష్ అన్నారు. ఆదివారం మండలంలోని జగ్గన్నపేట, వెంకట్రామన్నగూడెం గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటేష్ మాట్లాడుతూ ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా గుడ్డ సంచులను వినియోగించాలన్నారు. అలాగే, ఇళ్లల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసి పారిశుద్ధ్య సిబ్బందికి అందించాలన్నారు. గ్రామ పారిశుద్ధ్యానికి ప్రజలు సహకరించాలన్నారు. పంచాయతీ కార్యదర్శి బాలకృష్ణ, అల్లూరి సత్యనారాయణ, ఎంఆర్‌సీ ఎం.రవికిరణ్, సచివాలయ, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ లోక్ అదాలత్‌ను వినియోగించుకోవాలి

నరసాపురం: పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారం కోసం వచ్చే నెల 8న జాతీయలోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి పి.విజయదుర్గ చెప్పారు. కక్షిదారులు జాతీయలోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

దాతల ఔదార్యం అభినందనీయం



తణుకు: దాతలను సత్కరించిన మానవత సంస్థ ప్రతినిధులు



అత్తిలి: పేదలకు దుప్పట్లు అందిస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు

తణుకు అర్బన్: మానవత సేవా సంస్థ అందిస్తున్న సేవా కార్యక్రమాలకు దాతలు అందిస్తున్న సహకారం మరువలేనిదని జిల్లా శాంతి ర్యాలీ కమిటీ చైర్మన్ గమిని రాంబాబు, స్టేట్ కన్వీనర్, విస్తరణ మరియు అభివృద్ధి కమిటీ కన్వీనర్ డాక్టర్ కోడూరి రాధా పుష్పావతి అన్నారు. తణుకు రోటరీక్లబ్‌లో ఆదివారం నిర్వహించిన మానవత సంస్థ సమావేశంలో వారు మాట్లాడుతూ అమెరికన్ టెలిఫోన్ అండ్ టెలి కమ్యూనికేషన్ సర్వీసెస్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న కేవీఎస్‌జీ శ్రీనివాసరావు అభినందనీయులని, ఇప్పటివరకు మానవత సంస్థ ద్వారా కళాశాలలకు 7 కంప్యూటర్ సిస్టమ్స్‌ను ఉచితంగా అందజేశారని అన్నారు. అనంతరం వివిధ కంపెనీల్లో పనిచేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు జి.రూపేష్, అనూషలకు ప్రతిభాపురస్కారాలు అందజేశారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీనివాసరావు అనారోగ్యంతో బాధపడుతున్న నిరుపేద మహిళకు రూ.5 వేలు, ఒబిలి శెట్టి మురళి హరినాథ్ రూ.వెయ్యి ఆర్థిక సాయాన్ని అందించారు. తణుకు శాఖ ఉపాధ్యక్షులు కడంచెర్ల రాజరాజేశ్వరరావు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో మానవత ప్రతినిధులు బొల్లం రామ కాశి, అక్కిన కాశీ విశ్వనాథం, ఆనందం మస్తాన్‌రావు, పులమాల వీరభద్రం, ఒబిలిశెట్టి మురళీ హరినాథ్, ఆకుల శేషుబాబు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ

అత్తిలి: మానవత స్వచ్ఛంద సేవా సంస్థ నెలవారీ సమీక్షా సమావేశాన్ని మండల అధ్యక్షుడు ముదునూరి బాలకృష్ణంరాజు అధ్యక్షతన ఆదివారం అత్తిలి మండలం పాలి గ్రామంలో నిర్వహించారు. ఈ సమావేశంలో గత నెలలో జరిగిన కార్యక్రమాలను సమీక్షించి, రానున్న నెలలో చేపట్టే సేవా కార్యక్రమాలపై చర్చించారు. ఈ సందర్భంగా గ్రామంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో మానవతా సంస్థ కార్యదర్శి కొరిపల్లి హరి, మాజీ అధ్యక్షుడు తోట వెంకట సుబ్బారావు, ఉపాధ్యక్షుడు ఆకుల ఆంజనేయులు, కార్యవర్గ సభ్యులు జీవై వెంకటరమణ పాల్గొన్నారు.

శాంతిరథానికి రూ. లక్ష విరాళం

అత్తిలి గ్రామానికి చెందిన మేకా వెంకటలక్ష్మి మానవతా శాంతి రథానికి రూ.లక్ష విరాళంగా ఆదివారం అందజేశారు. తన భర్త మేకా సత్యనారాయణ జ్ఞాపకార్థం ఈ విరాళం అందజేశారు. అనంతరం మానవత సంస్థ సభ్యులు వెంకటలక్ష్మిని శాలువాతో సత్కరించారు.

ఉత్సాహంగా మెగా కల్చరల్ నైట్

పోడూరు: ఉల్లంపర్రు మాంటిస్సోరీస్ స్థాపించి 35 ఏళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా వార్షికోత్సవాన్ని శనివారం రాత్రి ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన నరసాపురం ఆర్డీఓ దాసిరాజు జ్యోతి ప్రజ్వలన చేశారు. ఒకే విద్యాసంస్థ నుంచి ఒకే వేదికపై 984 మంది విద్యార్థులతో 52 ప్రోగ్రామ్స్‌తో నిర్వహించిన మెగా కల్చరల్ నైట్ ఎంతో అలరించింది. ప్రముఖ మిమిక్రీ ఆర్టిస్ట్ రవి మిమిక్రీ ప్రేక్షకులను ఎంతో అలరించింది. ఈ కార్యక్రమంలో మంత్రి నిమ్మల రామానాయుడు, ఎంఈఓ జి.వీరాస్వామి, స్కూల్ సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ మద్దాల రాంప్రసాద్, డైరెక్టర్ అండ్ అడ్మినిస్ట్రేటర్ మద్దాల వాసు, ప్రిన్సిపాల్ వసంత లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నేడు జోనల్ క్రీడా పోటీలు

ఆకివీడు: ఉన్నత పాఠశాలల్లో విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం పెంపొందించేందుకు మండల స్థాయి క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు మండల విద్యాశాఖాధికారి ఎ.రవీంద్ర ఆదివారం చెప్పారు. మండలంలోని సిద్ధాపురం గ్రామంలోని దామోదరం సంజీవయ్య జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 24 నుంచి రెండు రోజుల పాటు నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులు క్రీడా పోటీల్లో పాల్గొంటారని చెప్పారు. గేమ్స్, అథ్లెంటిక్స్ విభాగాల్లో పోటీలుంటాయన్నారు. పోటీల్లో గెలుపొందిన వారు జిల్లా స్థాయి పోటీల్లోనూ, రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ఎంఈఓ తెలిపారు. క్రీడా పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు.

సూర్య భగవానుడికి ప్రత్యేక పూజలు





తణుకులో విశేషాలంకరణలో సూర్యభగవానుడు, సూర్యాలయం వీధిలో క్యూకట్టిన భక్తులు

తణుకు అర్బన్: మాఘ మాసం ఆఖరి ఆదివారం సందర్భంగా తణుకు సూర్యదేవాలయానికి భక్తులు పోటెత్తారు. సూర్యనారాయణస్వామికి ఆదివారం ప్రీతికరమైన రోజుకావడం, మాఘ మాసం కావడంతో స్వామిని రకరకాల పుష్పాలు, తులసీ దళాలతో ప్రత్యేకంగా అలంకరించారు. దినకరుడిని ఆరోగ్యదాతగా కొలిచే భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో సూర్యాలయం వీధి పొడవునా భారీ క్యూకట్టారు. ఆలయ అర్చకులు వేదమంత్రోచ్ఛరణలతో పూజాధికాలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

సేవా కార్యక్రమాలు అభినందనీయం



రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం కార్యక్రమంలో శక్తి వేషాలు, ఇతర నృత్యాలు

తాడేపల్లిగూడెం (టీఓసీ): రంగస్థల కళాకారుల సంక్షేమ సంఘం నెలవారీ సేవా కార్యక్రమాలు అభినందనీయమని పలువురు వక్తలు కొనియాడారు. సంఘం 153వ నెలవారీ సభ, సమావేశం ఆదివారం సాయంత్రం గీతా మందిరంలో నిర్వహించారు. అధ్యక్షుడు సూరంపూడి వెంకటరమణ, ప్రధాన కార్యాదర్శి చింతకాయల వంశీ కృష్ణ, కోశాధికారి మాసా బాబూరావు సమావేశాన్ని పర్యవేక్షించారు. నీలాద్రిపురం ఆర్కే ఈవెంట్స్ అధినేత పాముల రామకృష్ణకు గౌరవ సత్కారం, నల్లజర్ల మండలం దూబచర్లకు చెందిన రంగస్థల కళాకారుడు యడవల్లి రాజలింగానికి కళా సత్కారం, ప్రధానోపాధ్యాయులు ఇర్లపాటి వెంకట కృష్ణారావుకు ఉత్తమ ఉద్యోగ సేవ పురస్కారం, పేద కళాకారుడు జి.రాంబాబుకు ఆర్థిక సత్కారం అందజేశారు. శక్తి వేషాలు, డప్పులు నృత్యాలు, సంగీత విభావరి నిర్వహించారు. పట్టణ ప్రముఖులు, కళాకారులు, సాహితీ సభ్యులు పాల్గొన్నారు.

ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి రక్ష



మాట్లాడుతున్న డాక్టర్ నార్ని భావాజీ

తాడేపల్లిగూడెం (టీఓసీ): మన ప్రాంతపు ఆహారపు అలవాట్లే మన ఆరోగ్యానికి శ్రీరామ రక్ష అని ప్రముఖ మధుమేహ వైద్య నిపుణులు డాక్టర్ నార్ని భావాజీ అన్నారు. స్థానిక ఎయిర్‌స్ట్రిప్ వాకర్స్ అసోసియేషన్ నెలవారీ సమావేశం ఆదివారం వాకర్స్ భవనంలో అధ్యక్షుడు తిరుమళ్ల సూరిబాబు అధ్యక్షతన నిర్వహించారు. డాక్టర్ భావాజీ మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ విధానాలపై చర్చించారు. పరిమిత ఆహారం తీసుకోవాలని, తక్కువ ఆయిల్ వాడాలని, వేళప్రకారం ఆహారం తీసుకోవాలని, కల్తీ ఆహార పదార్థాలను గుర్తించి నివారించుకోవాలని, ముడి బియ్యం వాడాలని, వ్యాయామం, యోగా చేయాలని తదితర విషయాలపై అవగాహన కల్పించారు. కోపల్లె శ్రీనివాస్‌చే నృత్య ప్రదర్శన, వనచర్ల నాగేంద్రప్రసాద్, కప్పల నరసింహమూర్తి, అనిల్, వనచర్ల విజయలక్ష్మి, వాకర్స్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రతి రోజూ ఓ మొక్క నాటండి



మన్‌కీబాత్‌లో పాల్గొన్న శక్తి కేంద్రం సభ్యులు

తాడేపల్లిగూడెం (టీఓసీ): ప్రతి రోజూ ఓ మొక్క నాటాలని మన్‌కీబాత్‌లో అంశాలను స్థానిక సర్దార్ వల్లభాయ్ పటేల్ శక్తి కేంద్రం అధ్యక్షుడు నరిశే సోమేశ్వరరావు పేర్కొన్నారు. మన్‌కీబాత్ 119వ కార్యక్రమం ఆదివారం శక్తి కేంద్రంలో ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. నరిశే సోమేశ్వరరావు మాట్లాడుతూ ప్రధానికి ఇష్టమైన కార్యక్రమం మన్‌కీబాత్ అన్నారు. కార్యక్రమంలో వ్యాపార, పారిశ్రామిక రంగం, మహిళలకు సంబంధించిన అంశాలు, మొక్కలు నాటడం తదితర అంశాలను మన్‌కీబాత్‌లో ప్రస్తావించారని తెలిపారు. కార్యక్రమంలో మహాత్మాగాంధీ శక్తి కేంద్రంలో తాడేపల్లిగూడెం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ ఈతకోట తాతాజీ, శక్తి కేంద్రం సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దిడ్ల వీర రాఘవులును గెలిపించాలి



ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న దృశ్యం

తాడేపల్లిగూడెం (టీఓసీ): మొదటి ప్రాధాన్యతా ఓటు దిడ్ల వీర రాఘవులుకు వేసి గెలిపించాలని సీఐటీయూ నాయకులు కోరారు. నియోజకవర్గంలో ఆదివారం ఎమ్మెల్సీ ప్రచార సభ నిర్వహించారు. నాయకులు మాట్లాడుతూ రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘం, ఉద్యోగ ఉపాధ్యాయ సంఘాలు నిలబెట్టిన అభ్యర్థిని ఎన్నుకోవాలని, తద్వారా ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని చెప్పారు. పీడీఎఫ్ అభ్యర్థిని గెలిపించడం ద్వారా నిత్యావసర వస్తువులు తగ్గేందుకు కృషి చేస్తామని, నిరుద్యోగ సమస్య తగ్గుతుందని, ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని చెప్పారు. సిరపరపు రంగారావు, చిర్ల పుల్లారెడ్డి, బంకూరు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ



కొడమంచిలిలో పారిశుద్ధ్య ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: మండలంలో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు ఈఓపీఆర్డీ జి.నరసింహారావు తెలిపారు. ఆదివారం కొడమంచిలిలో తడి పొడి చెత్తపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లో సచివాలయ సిబ్బంది టీములుగా ఏర్పడి ప్రజలకు తడి, పొడి చెత్తపై అవగాహన కలిప్తున్నారన్నారు. స్థానికులు తమ ఇంట్లో చెత్తను వేరువేరుగా సేకరించి ఇవ్వాలన్నారు. సేకరించని చెత్తను ఎస్‌డబ్ల్యూపీసీ షెడ్ వద్దకు తరలిస్తామన్నారు. ప్రజలు ఆరోగ్యంగా ఉండాలంటే పారిశుద్ధ్యం మెరుగుపడాలన్నారు. దీనికి ప్రజలందరూ సహకరించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎం.హనుమంతరావు, డిజిటల్ అసిస్టెంట్ ఎం.రవీంద్రబాబు, వెటర్నరీ అసిస్టెంట్ సురేందర్ రెడ్డి, అగ్రికల్చర్ అసిస్టెంట్ బాల సాయి నవీన్, జూనియర్ అసిస్టెంట్ బి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా చంద్రయ్య వర్ధంతి



ద్వారబందాల చంద్రయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సభ్యులు

పాలకొల్లు సెంట్రల్: బ్రిటిష్ పాలకుల దోపిడీ, దౌర్జన్యాలకు వ్యతిరేకంగా గిరిజన దళిత, బహుజన, పీడిత వర్గాల తరుపున పోరాటం చేసి ఆత్మార్పణకు గురైన పోరాట యోధుడు ద్వారబందాల చంద్రయ్య దొర పోరాటం ఎనలేనిదని ఎంబీసీ కార్పొరేషన్ మాజీ చైర్మన్, సంచార జాతుల సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు పెండ్ర వీరన్న కొనియాడారు. ఆదివారం పట్టణంలో ఓ అతిథి గృహంలో శ్రీకృష్ణదేవరాయ సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు యర్రంశెట్టి వెంకటరత్నం అధ్యక్షతన జరిగిన ద్వారబందాల చంద్రయ్య దొర 134వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పెండ్ర వీరన్న మాట్లాడుతూ చంద్రయ్య సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వంగా నరసింహరావు, పెనుమాక రామ్మోహనరావు, కొల్లాటి పెద్దిరాజు, కొట్టి భాస్కరరావు, మాడభూషి కృష్ణప్రసాద్, ముచ్చర్ల శ్రీరామ్, గంధం కుమారస్వామి తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీపై అసత్య ఆరోపణలు తగవు



పెన్నాడలో మాట్లాడుతున్న సర్పంచ్ చిల్లా అనూష, వార్డు సభ్యులు

పాలకోడేరు: మండలంలోని పెన్నాడ గ్రామ పంచాయతీలో ఎటువంటి అవినీతి జరలేదని, దీనిపై ఎటువంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నట్లు సర్పంచ్ చిల్లా అనూష అన్నారు. స్థానిక సచివాలయం వద్ద ఆదివారం గ్రామస్తులు, పాలకవర్గ సభ్యుల ఆధ్వర్యంలో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ అనూష మాట్లాడుతూ పంచాయతీలో కోట్లాది రూపాయలు అవకతవకలు జరిగాయని కొంతమంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని ఇది సరైన పద్ధతి కాదన్నారు. కొన్ని చానళ్లు కావాలనే బురద జల్లే ప్రయత్నం చేశారని ఇది సమంజసం కాదన్నారు. నిరంతరం గ్రామస్తులకు అందుబాటులో ఉండి వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశామన్నారు. అటువంటిది తమపై, తమ పంచాయతీపై అవినీతి ఆరోపణలు చేయడం సరి కాదన్నారు. తమపై లేనిపోని ఆరోపణలు చేసిన వారిపై లీగల్‌గా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బ్రహ్మాజీ, శివ, విక్రమ్, మమత, కల్యాణి, ఏసు పాల్గొన్నారు.

శివాలయాల వద్ద ఏర్పాట్లు జోరు

- నేటి నుంచి మహాశివరాత్రి ఉత్సవాలు
- శివరాత్రి రోజున ప్రత్యేక వైదిక కార్యక్రమాలు



ఆచంట రామేశ్వర స్వామి ఆలయం



విద్యుత్ దీపాల వెలుగుల్లో ఆచంట రామేశ్వర స్వామి ఆలయం ప్రాంతం

పెనుగొండ: మహాశివరాత్రి వేడుకలు అత్యంత వైభవంగా జరిగే పుణ్యక్షేత్రాల్లో ఆచంట రామేశ్వరాలయం ఒకటి. వశిష్టా గోదావరి తీరానికి కొద్దిపాటి దూరంలో ఉండే ఆచంటకు స్థల పురాణం ఉంది. ముఖ్యంగా మహాశివరాత్రి పర్వదినాన స్వామి వారికి లింగోద్భవ కాలమందు ఏకాదశ రుద్రాభిషేకం చేస్తే పాపాలు హరిస్తాయని భక్తుల నమ్మకం. అదేవిధంగా ఆచంటేశ్వరుని ఆలయంలో కార్తీక పౌర్ణమికి అఖండ కర్పూర జ్యోతి వెలిగించడం ఆనవాయితీగా వస్తుంది. కార్తీక పౌర్ణమికి వెలిగించిన అఖండ జ్యోతి శివరాత్రి వరకూ వెలుగుతూనే ఉంటుంది. శివరాత్రి నేపథ్యంలో ఆచంటేశ్వరునికి సోమవారం నుంచి 28 వరకు ఉత్సవాలు కనుల పండువగా నిర్వహిస్తారు. ఇప్పటికే పెద్ద ఎత్తున ఆలయం వద్ద చలువ పందిళ్లు, విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. 24న స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, దేవస్థానం వారి ద్వారా పట్టువస్త్రాల సమర్పణ, 25 వేకువ జామున కల్యాణోత్సవం, 26న మహాశివరాత్రి సందర్భంగా ప్రత్యేక అభిషేకాలు, స్వామివారి దర్శనం, మధ్యాహ్నం నుంచి భారీ రథోత్సవం, 27న స్వామివారికి, అమ్మవారికి ప్రత్యేక పూజలు, గ్రామోత్సవం నిర్వహిస్తారు. 28న త్రిశూలోత్సవం, సాయంత్రం పుష్పయాగం నిర్వహిస్తారు. ఐదు రోజుల పాటు సాగే ఉత్సవాల్లో వచ్చే వేలాది మంది భక్తులకు ఆలయ సత్రం వద్ద అన్నదాన కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున అన్నసమారాధన నిర్వహించడానికి ఏర్పాట్లు చేశారు.

ఉత్సవాలకు ముస్తాబైన లక్ష్మణేశ్వరం శివాలయం

నరసాపురం రూరల్: తీర ప్రాంతంలో ప్రసిద్ధి చెందిన లక్ష్మణేశ్వరం గ్రామంలోని శ్రీ దుర్గా లక్ష్మణేశ్వరస్వామి ఆలయం మహాశివరాత్రికి ముస్తాబైంది. సోమవారం నుంచి ప్రారంభమయ్యే శివరాత్రి మహోత్సవాలకు సంబంధించి ఘనంగా ఏర్పాట్లు చేశారు. ఆలయానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా చలువ పందిళ్లు ఏర్పాటు చేశారు. ఈ ఆలయంలో లక్ష్మణుడు శివలింగాన్ని ప్రతిష్ఠించడంతో ఈ గ్రామానికి లక్ష్మణేశ్వరం అనే పేరు వచ్చింది. బుధవారం జరిగే శివరాత్రి వేడుకలు, రథోత్సవాన్ని పురస్కరించుకుని భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉండే విధంగా ప్రత్యే భద్రతా ఏర్పాట్లును చేస్తున్నారు. పోలీసులు ఇప్పటికే ఆలయానికి చేరుకుని క్యూలైన్లు, దర్శనం, అవుట్‌లెట్ తదితర సౌకర్యాలతోపాటు రథోత్సవం జరిగే ప్రాంతాలను పర్యవేక్షించారు. ఆలయ సిబ్బంది, మాజీ కమిటీ సభ్యులతో సమావేశమై భక్తుల రద్దీవల్ల ఎలాంటి అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఉండేలా చర్యలు చేపట్టారు.



ఆచంటలో కార్తీక పౌర్ణమికి వెలిగించిన అఖండ జ్యోతి



దుర్గాలక్ష్మణేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం



లక్ష్మణేశ్వరం శివాలయంలో చలువ పందిళ్లు వేసిన దృశ్యం

వైభవంగా నందీశ్వరుని కల్యాణం



సిద్ధాంతంలో నందీశ్వర స్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యం

పెనుగొండ: సిద్ధాంతంలో శ్రీ పార్వతీ సమేత నందీశ్వర స్వామి శివరాత్రి మహోత్సవాల సందర్భంగా ఆదివారం రాత్రి స్వామి వారి కల్యాణం వేడుకగా నిర్వహించారు. ఆలయ అర్చకులు కాల్దరి సుబ్రహ్మణ్యం, వేద పండితులు దొంతుకుర్తి సత్యనారాయణ వేద మంత్రాలతో బడేటి గణేష్, శ్రీమతి సుబ్బలక్ష్మి దంపతులతో కల్యాణం జరిపించారు. ముందుగా స్వామివారికి అమ్మవారికి కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో మహిళా భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం గ్రామంలో స్వామి వారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ కార్య నిర్వహణాధికారి డి.పుష్పభాను ఏర్పాటును పర్యవేక్షించారు.

బాధితురాలికి వసుధ ఫౌండేషన్ వితరణ

పోడూరు: పాలకొల్లు పట్టణానికి చెందిన ఆర్.వెంకటరమణ కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతుంది. వసుధ ఫౌండేషన్ ఛైర్మన్ మంతెన వెంకటరామరాజు ఆమె గురించి తెలిసి ఫౌండేషన్ తరఫున రూ.10 వేల ఆర్థిక సాయం అందించారు. ఫౌండేషన్ కన్వీనర్ బుద్ధరాజు సంబంధిత చెక్కును ఆదివారం బాధితురాలికి అందజేశారు.